క్లుప్తంగా

శివుడి విగ్రహావిష్కరణ



రుద్రూర్: మండలంలోని రాణంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన వైకుంఠధామంలో శనివారం శివుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన దాత దయాల గంగామణి–సాయిలు కుటుంబ సభ్యులు తపస్సులో ఉన్న శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు శనివారం శివరాత్రి వేళా కూడా కొనసాగాయి. అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, సీనియర్ న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్‌రావు, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వెంకటేష్‌లు కూర్చున్నారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

శివయ్య దర్శనం కోసం పాదయాత్ర



రెంజల్(బోధన్): రెంజల్ ఆదర్శ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినులు శనివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కాలినడకన మూడు కిలోమీటర్లు పాదయాత్రగా వెళ్లి మహా శివుడిని దర్శించుకున్నారు. చదువుతో పాటు భక్తిభావం పెంపొందించుకునేందుకు ఆలయానికి వెళ్లినట్లు విద్యార్థినులు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహా సభలను జయప్రదం చేయండి



కమ్మర్‌పల్లి: జిల్లా కేంద్రంలో ఈ నెల 22న నిర్వహించే సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆవిర్భావ దినోత్సవ మహా సభలను విజయవంతం చేయాలని పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి సారా సురేష్ కోరారు. కమ్మర్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలిరావాలని పేర్కొన్నారు. నాయకులు కిషన్, సత్తెక్క, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆయుష్మాన్ భారత్’ను సద్వినియోగం చేసుకోవాలి



ఇందల్వాయి: పేద ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు నాయిడి రాజన్న సూచించారు. పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డిపల్లె గ్రామంలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించి అర్హులైన వారిని ఆన్‌లైన్లో ఆయుష్మాన్ భారత్ పథకంలో చేర్చారు. బీజేపీ నాయకులు సక్కి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





కుర్నాపల్లి ఉమామహేశ్వరాలయంలో భక్తుల పూజలు.. నందిపేటలోని కేదారీశ్వర ఆశ్రమంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు.. కమ్మర్‌పల్లిలో శివపార్వతుల కల్యాణోత్సవం

శంభో.. శివశంభో

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- కిటకిటలాడిన ఆలయాలు
- ఘనంగా శివపార్వతుల కల్యాణం



నందిపేటలో పూజలు చేస్తున్న న్యాయమూర్తులు



రుద్రూర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బోధన్‌లోని ఏకచక్రేశ్వర ఆలయంలో..

ఆర్మూర్‌టౌన్/పెర్కిట్(ఆర్మూర్): హర హర మహాదేవ శంభోశంకర అంటూ శైవక్షేత్రాలు మార్మోగాయి. శనివారం మహా శివరాత్రి సందర్భంగా పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్ట, మార్కండేయ ఆలయం సహా పలు శైవక్షేత్రాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధులగుట్టపైకి భక్తులు వెళ్లేందుకు ఆర్టీసీ డిపో బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని ఆయా శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుట్టపై శివపార్వతుల కల్యాణోత్సవాన్ని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. వీడీసీ తరపున ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అలాగే మండలంలోని ఆయా శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాల్కొండ /వేల్పూర్: బాల్కొండ, ముప్కాల్, వేల్పూర్, మెండోరా మండల పరిధిలోని గ్రామాల్లో మహా శివరాత్రివేడుకలను ఘనంగా నిర్వహించారు. ముప్కాల్ మండల కేంద్రంలో పడిలేచిన మర్రి చెట్టు వద్దకు భక్తులు పోటెత్తారు.

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రానికి సమీపంలోనికేదారీశ్వర ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కేదారీశ్వర ఆశ్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి పద్మావతితో పాటు జూనియర్ సివిల్ న్యాయమూర్తి భవ్య వారి కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు.

రెంజల్(బోధన్): మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని ఆలయాలను నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించారు.

బోధన్‌టౌన్/బోధన్ రూరల్: పట్టణంలోని ఏక చక్రేశ్వరాలయం, ఆత్మ లింగేశ్వరాలయం, కార్తికేశ్వర ఆలయాలను భక్తులు భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా వసతులు కల్పించారు. మండలంలోని ఆయా గ్రామాల్లోగల శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రుద్రూర్: కోటగిరి, మోస్రా, చందూర్, రుద్రూర్, పోతంగల్ మండలాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

నవీపేట: నవీపేటతో పాటు మండలంలోని జన్నెపల్లి, నాళేశ్వర్, యంచ, ఫకీరాబాద్ గ్రామాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. నాళేశ్వర్‌లోని పురాతన రాజరాజేశ్వరాలయంలో భక్తులు కోడెలతో మొక్కులు తీర్చుకున్నారు. పలు శివాలయాల్లో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.



ఎస్సారెస్పీలోని శివాలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



నవీపేట మండల కేంద్రంలో..



పెర్కిట్ శివ పంచాయతన ఆలయంలో భక్తుల క్యూ



పెంటాకుర్దులోని శివాలయంలో..



నాళేశ్వర్‌లో కోడెలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



వేల్పూర్ రాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఓం శాంతి భవనంలో జెండావిష్కరణ



నిజామాబాద్ సిటీ : నగరంలోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయం నాందేవ్‌వాడ సెంటర్‌లో శనివారం మహా శివరాత్రి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెంటర్ నిర్వాహకులు సునీతా బహెన్‌జీ ఓం శాంతి జెండాను ఎగురవేసి కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దండు నీతూ కిరణ్ చంద్రశేఖర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, ఓం శాంతి సెంటర్ల నిర్వాహకులు జ్యోతి బహెన్ జీ, బ్రహ్మకుమార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన షాదీ ముబారక్ చెక్కులను శనివారం జీపీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఖలీంబేగ్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 19 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం షాదీ ముబారక్ ద్వారా చెక్కులను మంజూరు చేసినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. నియోకవర్గ ఎమ్మెల్యే షకీల్, ఎమ్మెల్సీ కవితల సహకారంతో నిరుపేదలకు ఆర్థికసాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నీలా విండో చైర్మెన్ ఇమాంబేగ్, ఎంపీటీసీ అసద్‌బేగ్, బీఆర్‌ఎస్ నాయకులు మోసిన్‌బేగ్, గఫార్ పాల్గొన్నారు.

నేడు ఆర్మూర్ పట్టణంలో శివాజీ జయంతి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆదివారం శివాజీ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 12 అడుగుల శివాజీ విగ్రహంతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ సమితి అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, ప్రధాన కార్యదర్శి మందుల బాలు ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీని శివాజీ చౌక్ నుంచి పెర్కిట్ వరకు, తిరిగి శివాజీచౌక్ వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ర్యాలీలో ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ప్రతి విద్యార్థి లక్ష్యం దిశగా పయనించాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మాశరత్‌రెడ్డి

బోధన్‌టౌన్/బోధన్: విద్యను అభ్యసించే ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని లక్ష్యం దిశగా పయనించాలని ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అన్నారు. పట్టణంలోని లయోల పాఠశాలలో శుక్రవారం రాత్రి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్, ఆర్డీవో రాజేశ్వర్లు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదవి ఉన్నత స్థానంలో నిలవాలంటే శ్రద్ధ, పట్టుదల, ఏకాగ్రత అవసరమని అన్నారు. గురువులు చెప్పిన పాఠశాలను వినడంతో పాటు నిరంతంరం అభ్యసన చేయాలని అప్పుడు ఉత్తీర్ణులు అవుతారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకర్షించాయి. చదువుల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, కౌన్సిలర్లు శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థమే యాగాల నిర్వహణ



బోధన్‌లో నిర్వహించిన ఆయుత చండీ యాగంలో పాల్గొన్న జంటలు



పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మాశరత్‌రెడ్డి దంపతులు

బోధన్ : లోక కల్యాణార్థమే పూర్వీకుల కాలం నుంచి యజ్ఞాలు, యాగాలు నిర్వహిస్తూ, వస్తున్నారని కరీంగనగర్ విశ్వేశ్వర మహాపీఠం స్వామి ప్రణవానంద స్వామి ప్రబోధించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం మహా శివరాత్రి సందర్భంగా ఆయుత చండీయాగం ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రముఖులు, స్వామీజీ సహకారంతో ఈ యాగం ఏర్పాటు చేశారు. 108 యజ్ఞ కుండీలు ఏర్పాటు చేసి, 516 మంది జంటలతో యాగం నిర్వహించారు. యాగం ప్రాంగణంలో చండీమాత, శివపార్వతుల సపరివార దేవతామూర్తుల ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాల ప్రవేశం, గోపూజ, మహాపూర్ణాహుతి, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన యాగం ప్రత్యేక పూజలు, సాయంత్రం వరకు కొనసాగాయి. ఈసందర్భంగా స్వామీజీ భక్తులకు ప్రబోధించారు. ఆయుత చండీయాగం ఎంతో మహిమానిత్వ యాగమని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి దంపతులతో పాటు పట్టణ ప్రముఖులు యాగంలో కూర్చున్నారు.

నియామకం

ఇందల్వాయి : ఆర్టీఐ యాక్టివిస్ట్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్‌గా సిర్నాపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ రంజాన్ శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు జిముత్తు జిల్లా కేంద్రంలో రంజాన్‌కు నియామక పత్రం అందజేశారు. ప్రజలందరికి సమాచార హక్కు చట్టం యొక్క ప్రాముఖ్యతని తెలియజేయడమే కాకుండా ఆర్టీ కార్యకర్తల భద్రతపై కృషి చేస్తానని రంజాన్ తెలిపారు.

అధ్వానం.. అపరిశుభ్రం

- నగర శివారులోని స్లాటర్‌హౌజ్‌లో కనీస సౌకర్యాలు కరువు
- దుర్వాసనతో స్థానికులకు అవస్థలు



అధ్వానంగా ఉన్న స్లాటర్‌హౌజ్ పరిసరాలు

నిజామాబాద్‌నాగారం : నగర శివారులోని స్లాటర్ హౌజ్ చుట్టూ పరిసరాలు దుర్వాసన..అపరిశుభ్రత కారణంగా స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. స్లాటర్‌హౌజ్‌లోనూ ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో వ్యాపారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేషన్ అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూడకపోవడంతో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

టెండర్ దక్కించుకుని..

నగరంలోని 11వ డివిజన్‌లో బాబాన్‌సాహెబ్‌లో స్లాటర్‌హౌజ్ ఉంది. రూ.17.75 లక్షలకు ఓ కాంట్రాక్టర్ టెండర్ ద్వారా ఈ స్లాటర్‌హౌజ్‌ను దక్కించుకున్నారు. అయితే ఆ ప్రాంతంలో కనీస సౌకర్యాలైన నీళ్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. అలాగే స్లాటర్‌హౌజ్‌లో పశువులను(ఎద్దులను) వధించేందుకు రూ. 30 లోపు ఫీజు ఉండాలి. అయితే ఫీజు రూ. 50 కన్నా ఎక్కువగా తీసుకుంటున్నప్పటికీ కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదు. ఎట్టి పరిస్థితిలో ఇక్కడ గేదెలను కోయవద్దని నిబంధన ఉన్నప్పటికీ అమలు కావట్లేదు. కాని ముసలి గేదెలను రూ. 2 వేల వరకు కొనుగోలు చేసి తీసుకొచ్చి ఇక్కడ వధించి రూ. 30 వేల వరకు ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. చనిపోయిన పశువులను కూడా తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా వధించి అక్రమంగా దండుకుంటున్నారు. రోజుకు సుమారుగా 120 నుంచి 180 వరకు పశువులను వధిస్తుంటారు. అయితే పెద్దఎత్తున కాంట్రాక్టర్‌కు ఆదాయం వస్తున్నప్పటికీ సౌకర్యాల విషయంలో ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు.

కమీషన్లు అందుతున్నాయా..?

శానిటేషన్‌కు సంబంధించిన అధికారుల ఒక్కసారి కూడా ఈ స్లాటర్‌హౌజ్ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. పరిసరాలు కంపుకొడుతున్నా పట్టించుకోరు. స్లాటర్‌హౌజ్‌లో ఉన్న సమస్యలేమిటీ.. వారి పరిష్కార మార్గాలేమిటనే విషయంపై ఎవరూ శ్రద్ధ చూపడం లేదు. ప్రతినెలా మామూళ్లు తీసుకుని వెళ్లడంతోనే అటు వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ స్లాటర్ హౌజ్ పక్కనే మటన్‌కు సంబంధించి స్లాటర్‌హౌజ్ కూడా ఉంది. అందులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పశువులను, మేకలను కోసి తర్వాత వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడే పడేస్తుండడంతో విపరీతమైన దుర్వాసన వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

స్లాటర్‌హౌజ్ దారుణంగా తయారైంది. ఏళ్ల తరబడిగా దీనిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. శానిటేషన్ అధికారులకు తెలిసినా ఈ వైపు రావడం లేదు. దీంతో ఇక్కడికి వచ్చే వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఫీజులు ఇష్టారాజ్యంగా తీసుకుంటున్నారు. భరించలేని దుర్వాసన వస్తుంది. వెంటనే సమస్యలు పరిష్కరించాలి.

– సయ్యద్‌ఖైసర్,
కాంగ్రెస్ మైనారిటీ నాయకులు

డీసీకి ఫిర్యాదుతో తనిఖీ

కాంగ్రెస్ మైనారిటీకి చెందిన నాయకులు నేరుగా డిప్యూటీ కమిషనర్ అలీంకు స్లాటర్ హౌజ్‌పై ఫిర్యాదు చేశారు. ఒక్కసారి వచ్చి తనిఖీలు చేయాలని విన్నవించగా తనిఖీలకు వెళ్లిన అధికారి ఆశ్చర్యానికి గురయ్యారు. ఇంత దారుణంగా స్లాటర్‌హౌజ్ ఉండడంపై సంబంధిత కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

భాగ్యరెడ్డి వర్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



నిజామాబాద్ నాగారం : తెలంగాణ వైతాళికులు, అది హిందు ఉద్యమ పితామహుడు మాదరి భాగ్యరెడ్డి వర్మ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై నెలకొల్పాలని, ఒక ప్రఖ్యాత ప్రభుత్వ సంస్థకు ఆయన పేరు పెట్టి గౌరవించాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో భాగ్యరెడ్డి వర్మ వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు చిట్టిటి మోహన్ రావు, దళిత నాయకులు దితరులు పాల్గొన్నారు.